క్లుప్తంగా

ఎమ్మెల్యేకు ఆహ్వానం



ఎమ్మెల్యేతో ముదిరాజ్ సంఘం నాయకులు

జగిత్యాలరూరల్: మండలంలోని హన్మాజీపేట పెద్దమ్మతల్లి ఆలయంలో ఈనెల 28న నిర్వహించే అన్నదాన కార్యక్రమానికి హాజరు కావాలని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌ను శుక్రవారం గ్రామ ముదిరాజ్ సంఘం సభ్యులు ఆహ్వానించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బొడ్డు దామోదర్, ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు బక్కన్న, సభ్యులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన డైరెక్టర్

జగిత్యాల: శ్రీ శ్రీనివాస భవాని శంకర ఆంజనేయ ఆలయానికి ఇటీవల డైరెక్టర్‌గా నియమితులైన ఉమాభారతి ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. డైరెక్టర్‌గా నియమించినందుకు ఆమె అభినందనలు తెలిపారు. ఆయన వెంట సత్యనారాయణ ఉన్నారు.

ఆస్పత్రిలో డ్రగ్ ఇన్‌స్పెక్టర్ తనిఖీ



రిజిస్టర్ పరిశీలిస్తున్న డ్రగ్ ఇన్స్‌పెక్టర్

కోరుట్ల: కోరుట్ల ప్రభుత్వాసుపత్రిలో అందుబాటులో ఉన్న మందుల వివరాలను జగిత్యాల డ్రగ్ ఇన్‌స్పెక్టర్ ఉపేందర్ శుక్రవారం తనిఖీ చేశారు. ఆస్పత్రిలోని జగిత్యాల సెంట్రల్ మెడిసిన్ స్టోర్ నుంచి అవసరమైన మందులు ఎప్పటికప్పుడు తెప్పించుకోవాలని ఆయన సూచించారు. .విష జ్వరాలు ప్రబలుతున్న క్రమంలో యాంటిబయాటిక్, ఫీవర్ మందులు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. తనిఖీల్లో బాగంగా ఆసుపత్రి మెయిన్‌స్టోర్ నుంచి మందులు, మెడిసిన్ నమూనాలు సేకరించి టెస్టింగ్ కోసం లాబరేటరీకి పంపించారు. ఆయన వెంట ఆస్పత్రి సూపరింటెండెంట్ డా. సునీతరాణి, డాక్టర్ వినోద్, రమేష్, ఫార్మాసిస్ట్ ఉదయ్ ఉన్నారు.

సీఎమ్మార్‌ఎఫ్‌తో పేదల ఆరోగ్యానికి భరోసా

కథలాపూర్: సీఎమ్మార్‌ఎఫ్‌తో పేదల ఆరోగ్యానికి కాంగ్రెస్ ప్రభుత్వ భరోసా కల్పిస్తుందని పీసీసీ కార్యవర్గసభ్యుడు తొట్ల అంజయ్య అన్నారు. శుక్రవారం కథలాపూర్ మండలం సిరికొండలో వివిధ గ్రామాలకు చెందిన 43 మందికి సీఎమ్మార్‌ఎఫ్ చెక్కులను అందించారు. చెక్కులను ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మంజూరు చేయించినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు కాయితి నాగరాజు, ఏఎంసీ చైర్మన్ పూంద్ర నారాయణరెడ్డి, మార్కెట్ డైరెక్టర్ ఎం.డీ హఫీజ్, తదితరులు పాల్గొన్నారు.

29 న బహిరంగ వేలం

కోరుట్లటౌన్: పట్టణంలోని శ్రీ సాయిరామ ఆలయంలో ఏడాదిపాటు పూజా సామగ్రి అమ్ముకునేందుకు ఈనెల 29 సోమవారం సీల్డు టెండర్లు, బహిరంగ వేలం ఉదయం 10 గంటలకు నిర్వహిస్తున్నట్లు కార్యనిర్వహణాధికారి శుక్రవారం తెలిపారు. కొబ్బరి కాయలు, పూజ సామగ్రి, పూలు, పూల దండలు, కొబ్బరి ముక్కలు పోగు చేసుకునే హక్కు పొందుటకు వేలం వేస్తున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి ఉన్నవారు డీడీలు తీసి, హాజరు కావాలని పేర్కొన్నారు.

పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

పెగడపల్లి: పోషక విలువలతో కూడిన ఆహారం తీసుకుంటూ వైద్యుల ఆరోగ్య సలహాలు పాటిస్తే సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని జిల్లా డిప్యూటీ వైద్యాధికారి శ్రీనివాస్ అన్నారు. మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో శుక్రవారం చర్మవ్యాధి, సాధారణ ఆరోగ్య పరీక్షలు,కంటి పరీక్షలు నిర్వహించారు. వైద్యులు రోగులను పరీక్షించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యులు ఇంతియాజ్ అలీ, సబాఫాతిమా, పీహెచ్‌సీ వైద్యాధికారి నరేశ్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు మహేశ్వరి, సుభద్ర, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

లిక్కర్ టెండర్ల గెజిట్ విడుదల

జగిత్యాలక్రైం: జగిత్యాల జిల్లాలో 71 మద్యం షాపులకు శుక్రవారం రాత్రి కలెక్టర్ సత్యప్రసాద్ గెజిట్ విడుదల చేశారు. ఈమేరకు డ్రా పద్ధతిన 8 ఎస్సీలకు, 14 గౌడ కులస్తులకు, 49 జనరల్‌కు కేటాయించనున్నారు. ఎస్సీ కోటాలో జగిత్యాల షాపు 1, 7, అల్లీపూర్, మల్యాల మండలం తక్కళ్లపల్లి, ఎండపల్లి, బీర్‌పూర్ మండలం కొల్వాయి, తుంగూర్, మెట్‌పల్లి 5, కోరుట్ల 6 షాపులు ఎస్సీలకు రిజర్వ్ కాగా, బీసీ రిజర్వేషన్ 14 కాగా, జగిత్యాల 8, కొడిమ్యాల 1, జాబితాపూర్, కొండగట్టు ముత్యంపేట1, మన్నెగూడెం, బీమారం, బుగ్గారం మండలం గోపులాపూర్ సారంగాపూర్ లక్ష్మీదేవిపల్లి షాపు నంబరు 1, మెట్‌పల్లి 3, 6, కోరుట్ల 1, 5, మొగిలిపేట, వేములకుర్తి కాగా, మిగతా షాపులను జనరల్‌కు కేటాయించారు.



ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తాం



బతుకమ్మ పండగ అంటేనే మహిళ డాక్టర్లకు ఒక కోలాహలం. ప్రతీ ఏటా జగిత్యాలలో ఐఎంఏ ఆధ్వర్యంలో బతుకమ్మ, దసరా ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తాం. ఆ రోజంతా జిల్లా కేంద్రంలోని డాక్టర్లంతా కుటుంబ సభ్యులతో కలిసి బతుకమ్మ ఆటలాడుతూ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకైన బతుకమ్మ నిర్వహిస్తాం. – డాక్టర్ ఒడ్నాల రజిత, డీజీవో, రాయికల్

బతుకమ్మ అంటేనే ఆధ్యాత్మిక సందేశం



బతుకమ్మ పండగ అంటేనే మహిళల్లో 9 రోజుల పాటు ఒక ఆధ్యాత్మిక సందేశం. 9 రోజులు ఒక్కో రోజు ఒక్కో రకం పూలతో బతుకమ్మను అందంగా పేర్చి బతుకమ్మ ఆటలాడుతాం. బతుకమ్మ అంటేనే మహిళలకు విడదీయలేని బంధం. ఎంత బిజీగా ఉన్నా డాక్టర్లంతా కలిసి బతుకమ్మ ఘనంగా నిర్వహిస్తాం. – డాక్టర్ మోర రోజా, డీజీవో, జగిత్యాల

తొమ్మిది రోజుల పాటు భక్తి శ్రద్ధలతో...



బతుకమ్మ అంటేనే గుర్తుకు వచ్చేది తొమ్మిది రోజుల పండగ. మొదటి రోజు నుంచి ప్రారంభమై తొమ్మిది రోజుల పాటు ప్రతీ రోజు బతకమ్మ విశిష్టతను వివరిస్తూ బతుకమ్మ ఆటలాడుతాం. చిన్న పెద్ద తేడా లేకుండా బతుకమ్మ ఆటలాడి చివరి రోజు ఘనంగా నిమజ్జనం చేస్తాం. – డాక్టర్ సంజన, ఫిజియో థెరపిస్ట్, జగిత్యాల

కుంకుమ పూజలు.. అభిషేకాలు

జగిత్యాలరూరల్/జగిత్యాల టౌన్ ధర్మపురి మెట్‌పల్లి/కథలాపూర్/మల్యాల/ఇబ్రహీంపట్నం/మల్లాపూర్/పెగడపల్లి: దేవి నవరాత్రి ఉత్సవాలు జిల్లా వ్యాప్తంగా వైభవంగా కొనసాగుతున్నాయి. శుక్రవారం మండపాల వద్ద నిర్వాహకులు కుంకుమపూజలు, అన్నదానాలు చేశారు.మల్లాపూర్ మండలంలోని కుస్తాపూర్‌లో శుక్రవారం మహిళలు దుర్గామాత బోనాలు చేశారు. భక్తులకు అమ్మవారు లలితాదేవి, లక్ష్మీదేవి, మహాలక్ష్మీ అవతారాల్లో దర్శనం ఇచ్చారు. దుర్గాదేవికిరంగురంగుల గాజులతో తయారు చేసిన చీరలో అలంకరించారు.



శేషవాహనంపై స్వామివారు





జగిత్యాలరూరల్: కుంకుమపూజలు చేస్తున్న మహిళలు కథలాపూర్ మండలం దూలూరులో..



మెట్‌పల్లిలో కుంకుమపూజలు చేస్తున్న మహిళలు



ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలో మహిళల పూజలు

వైభవంగా బతుకమ్మ వేడుకలు



ఐద్వా ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలు



అల్ఫోర్స్‌లో వేడుకల్లో నరేందర్‌రెడ్డి, విద్యార్థినులు



సారంగాపూర్ కళాశాలలో వేడుకలు

జగిత్యాల/జగిత్యాలటౌన్/సారంగాపూర్/కథలాపూర్: జిల్లా కేంద్రంలోని అల్ఫోర్స్ జూనియర్ కళాశాలలో బతుకమ్మ వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. అల్ఫోర్స్ అధినేత నరేందర్‌రెడ్డి విద్యార్థులు ఆనందోత్సవాల మధ్య బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. అఖిల భారత ప్రజాతంత్ర్య మహిళా సంఘం(ఐద్వా) జిల్లా శాఖ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. బతుకమ్మ సారంగాపూర్, బీర్‌పూర్ మండలాల్లో బతుకమ్మ సంబురాలు ఘనంగా సాగుతున్నాయి. శుక్రవారం సారంగాపూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులు, అధ్యాపకులు, ప్రిన్సిపల్ రమేష్‌బాబు బతుకమ్మ ఆడారు

కథలాపూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థినులు బతుకమ్మ ఆట పాటలతో సందడి చేశారు. మల్యాల పీహెచ్‌సీలో శుక్రవారం మండల వైద్యురాలు మౌనిక ఆధ్వర్యంలో బతుకమ్మ సంబురాలు ఘనంగా నిర్వహించారు.

చాకలి ఐలమ్మకు నివాళి



రాయికల్: నివాళి అర్పిస్తున్న తహసీల్దార్



నివాళి అర్పిస్తున్న దావ వసంత, నాయకులు



కోరుట్లలో నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే సంజయ్

జగిత్యాలరూరల్/కోరుట్ల/రాయికల్/మల్యాల/ఇబ్రహీంపట్నం/మేడిపల్లి/మల్లాపూర్/సారంగాపూర్: చాకలి అయిలమ్మ పోరాట యోధురాలని కోరుట్ల ఎమ్మెల్యే సంజయ్, జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత అన్నారు. శుక్రవారం జిల్లా వ్యాప్తంగా చాకలి అయిలమ్మ జయంతి సందర్భంగా ఆమె విగ్రహాలు, చిత్రపటాలకు నాయకులు నివాళి అర్పించారు. తెలంగాణ సాయుధ పోరాటంలో ఆమె పాత్ర మరువలేనిదని పలువురు కొనియాడారు. కార్యక్రమాల్లో వివిధ పార్టీల నాయకులు, రజక సంఘం నాయకులు పాల్గొన్నారు.



బర్థీపూర్‌లో ఐలమ్మ విగ్రహం ఆవిష్కరణ



మల్లాపూర్‌లో కాంగ్రెస్ నాయకుల నివాళి

చాకలి ఐలమ్మ ఆశయ సాధనకు కృషి చేయాలి



ధర్మపురిలో నివాళి అర్పిస్తున్న మంత్రి అడ్లూరి

ధర్మపురి: సామాజిక సమానత్వానికి ప్రతీకగా నిలిచిన చాకలి ఐలమ్మ ఆశయ సాధనకు కృషి చేయాలని రాష్ట్ర సంక్షేమశాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. ధర్మపురి పట్టణంలోని చింతామణి చెరువు కట్ట వద్ద శుక్రవారం చాకలి ఐలమ్మ జయంతి సందర్భంగా ఆమె విగ్రహానికి పూలమాలలేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో రజక సంఘం నాయకులు, కాంగ్రెస్ నాయకులు తదితరులున్నారు.

ఫ్యాక్టరీ పునఃప్రారంభం విషయంలో కాలయాపన వద్దు

మెట్‌పల్లి రూరల్: ముత్యంపేట షుగర్ ఫ్యాక్టరీ పునఃప్రారంభం విషయంలో ప్రభుత్వం కాలయాపన చేయకుండా వెంటనే పనులు ప్రారంభించాలని బీజేపీ నాయకులు మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌ను కోరారు. మెట్‌పల్లి మండలం వేంపేటలో మంత్రి అడ్లూరిని బీజేపీ నాయకులు కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు యాదగిరిబాబు, నాయకులు చిట్నేని రఘు, సురభి నవీన్, నవీన్, శ్రీనివాస్,తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల వేతనాలు విడుదల చేయాలి

జగిత్యాలటౌన్: పంచాయతీ కార్మికుల పెండింగ్ వేతనాలు వెంటనే విడుదల చేయాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి పుప్పాల శ్రీకాంత్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం జగిత్యాల కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. అనంతరం జిల్లా పంచాయతీ అధికారికి వినతిపత్రం అందజేశారు. మూడు నెలల వేతన బకాయిలు ఉండటంతో కార్మికులు దసరా పండుగ జరుపుకోలేని పరిస్థితిలో ఉన్నారని తెలిపారు. కార్యక్రమంలో కోమటి చంద్రశేఖర్, జిల్లా కార్యదర్శి పులి మల్లేశం, జిల్లా నాయకులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికుల నిరసన

ధర్మపురి: జీతాలు చెల్లించక పోవడంతో పంచాయతీ కార్మికులు స్థానిక మండల పరిషత్ కార్యాలయం ముందు బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం కార్మికుల సమస్యలపై ఎంపీడీవోకు వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో ముదుగం రాజలింగు, సత్తయ్య, రాజయ్య, వెంకటేష్, ఇందవ్వ తదితరులున్నారు.

మహిళలు ఆరోగ్యంపై దృష్టి సారించాలి

వెల్గటూరు: మహిళలు ఆరోగ్యంపై దృష్టి సారించాలని వెల్గటూర్ మండల వైద్యాధికారి డా.కొండ తేజశ్రీ అన్నారు. శుక్రవారం వెల్గటూర్ మండల కేంద్రంలోని వెల్గటూర్ పీహెచ్‌సీ పరిధిలో స్వస్థ్ నారీ స్వశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ క్యాంపులో 150 మంది స్త్రీలకు చర్మ సంబంధిత పరీక్షలు నిర్వహించినట్లు డెర్మటాలజిస్ట్ డా.శ్రీపతి తెలిపారు. కార్యక్రమంలో వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి కూలీ కుటుంబానికి ఎక్స్‌గ్రేషియా అందజేత

కోరుట్ల రూరల్: మండలంలోని నాగులపేట గ్రామానికి చెందిన ఉపాధిహామీ కూలీ కుంట లక్ష్మి కొన్ని నెలల క్రితం గుండె పోటుతో మృతి చెందింది. దీంతో ఆమె కుటుంబానికి రూ. 2 లక్షలు ఎక్స్‌గ్రేషియా మంజూరు కాగా శుక్రవారం లక్ష్మి కుటుంబ సభ్యులకు చెక్కు అందించారు. కార్యక్రమంలో కార్యదర్శి శ్రీనివాస్, కారోబార్ లక్ష్మీనారాయణ, ఇందిరమ్మ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

పెగడపల్లి: మండల కేంద్రంలోని సబ్ స్టేషన్ పరిధిలోని పెగడపల్లి, ఏడుమోటపల్లి, నామాపూర్, మ్యాకవెంకయ్యపల్లి, నరసింహునిపేట, వెంగళాయిపేట గ్రామాల్లో శనివారం ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ వెంకట్‌రెడ్డి తెలిపారు.

గిరిజన కమ్యూనిటీ భవనాలకు స్థలాలు కేటాయించాలి

పెగడపల్లి: మండలంలో ఉన్న గిరిజన తండాల్లో గిరిజన కమ్యూనిటీ మండల కేంద్రంలో సంత్ సేవాలాల్ మహరాజ్ బంజరా భవన నిర్మాణాల కోసం ప్రభుత్వ స్థలాలు కేటాయించాలని సంఘం నాయకులు శుక్రవారం తహసీల్దార్ ఆనంద్‌కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో గిరిజన బంజరా సంఘం ధర్మపురి నియోజకవర్గ అధ్యక్షుడు నాగావత్ జీవన్ నాయక్, లంబాడ హక్కుల పోరాట సమితి రాష్ట్ర కన్వీనర్ నగావత్ శ్రీనివాస్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

మన్మోహన్ సింగ్ జయంతి

పెగడపల్లి: మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ జయంతి వేడుకలు నిర్వహించారు. ఆయన చిత్రపటానికి నివాళి అర్పించారు. దేశప్రధానిగా అందించిన సేవలు, అమలు చేసిన సంస్కరణలను కొనియాడారు. ఏఎంసీ చైర్మన్ రాములుగౌడ్, వైస్ చైర్మన్ సత్తిరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీ సేవలు వినియోగించుకోవాలి

జగిత్యాల: ఆరోగ్యశ్రీ సేవలు వినియోగించుకోవాలని మున్సిపల్ మాజీ చైర్ పర్సన్ జ్యోతి అన్నారు. జిల్లా కేంద్రంలోని ఆరోగ్య హాస్పిటల్‌లో ఆరోగ్యశ్రీ ఉచిత సేవలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పేద ప్రజలకు ఉపయోగపడే గుండె సంబంధిత సేవలకు సుదూరంగా వెళ్లకుండా ఇక్కడే ప్రారంభించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో వైద్యులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు ఢీ కొని వ్యక్తికి గాయాలు

మెట్‌పల్లి: పట్టణ శివారులో జాతీయ రోడ్డుపై శుక్రవారం ఆర్టీసీ బస్సు..ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టిన ఘటనలో భూమారెడ్డి(60) అనే వ్యక్తికి గాయాలయ్యాయి. నిజామాబాద్ నుంచి వరంగల్‌కు వెళ్తున్న ఆర్టీసీ బస్సు.. మార్గమధ్యంలో మెట్‌పల్లి శివారులో ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టింది. ఈ సంఘటనలో దానిపై ఉన్న భూమారెడ్డికి పలుచోట్ల గాయాలయ్యాయి. వెంటనే అతన్ని మెట్‌పల్లి ప్రభుత్వాసుపత్రికి..ఆ తర్వాత మెరుగైన చికిత్స కోసం కుటుంబ సభ్యులు జగిత్యాలకు తరలించారు.

మహిళా కాంగ్రెస్ సమావేశానికి హాజరు

జగిత్యాలటౌన్: ఈనెల 29న సరూర్‌నగర్‌లో నిర్వహించే బతుకమ్మ సంబరాలకు సంబంధించి శుక్రవారం మంత్రి సీతక్క అధ్యక్షతన హైదరాబాద్ గాంధీభవన్‌లో నిర్వహించిన సమావేశానికి జగిత్యాల జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు తాటిపర్తి విజయలక్ష్మి హాజరయ్యారు. పదివేల బతుకమ్మలతో జరిగే ఈ వేడుకలకు జిల్లా నుంచి మహిళలు భారీగా హాజరు కావాలని విజయలక్ష్మి కోరారు.

విద్యుత్ ఆర్టిజన్ జేఏసీ జిల్లా కార్యవర్గం ఎన్నిక

జగిత్యాలఅగ్రికల్చర్: విద్యుత్ ఆర్టిజన్ జేఏసీ జిల్లా కార్యవర్గంను శుక్రవారం ఎన్నుకున్నారు. చైర్మన్‌గా చిన్నవేణి బాబు యాదవ్, కన్వీనర్ దమ్మ రవీందర్ రెడ్డి, కో-చైర్మన్‌గా కాసెట్టి రాంబాబు, కో కన్వీనర్‌గా బొజ్జ తిరుపతి, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా విద్యాసాగర్, జాయింట్ సెక్రటరీలుగా మెండె రాజేందర్, ప్రవీణ్, నవీన, బోయిన మల్లేషం, మందపల్లి శ్రీనివాస్, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా ఎస్. ప్రవళిక, జె. శరణ్య, ఎండి ముదసిర్ అలీ, జి. రవీందర్, బూర సంతోష్‌కుమార్, సాన రంజిత్, కోశాధికారిగా కొండూరు శ్రీధర్, మీడియా ఇన్‌చార్జిగా అన్నారపు రమేశ్, గౌరవ సలహాదారుగా అరుముల్ల శ్రీకాంత్ ఎన్నికయ్యారు.

యెఖీన్‌పూర్ వీడీసీ నూతన కార్యవర్గం

కోరుట్ల రూరల్: కోరుట్ల మున్సిపల్ విలీన గ్రామం యెఖీన్‌పూర్ గ్రామాభివృద్ధి కమిటీ నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.అధ్యక్షుడిగా కాశిరెడ్డి మోహన్ రెడ్డి, ఉపాధ్యక్షుడిగా కథలాపూరం శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శులుగా చెట్ల చిన్న మల్లయ్య, పట్టాపురం యాదాగౌడ్, బీసీ చైర్మన్‌గా పొన్నం రమేష్, వైస్ చైర్మన్‌గా శనిగారపు లింగం లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో జాగిలం భాస్కర్, మిట్టపెల్లి మోహన్, ముత్యాల రవి, శనిగారపు పెద్ద పాల భూమన్న, చిట్యాల నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

పెగడపల్లి: మండలంలోని అయితిపల్లి గ్రామ శివారులో శుక్రవారం పేకాట ఆడుతున్న ఎనిమిది మందిని అరెస్టు చేసినట్లు ఎస్సై కిరణ్ కుమార్ తెలిపారు. గ్రామ శివారులో పేకాట ఆడుతున్నట్లు వచ్చిన సమాచారం మేరకు శిబిరంపై దాడి చేసి ఎనిమిది మంది జూదరులను అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ. 3950 నగదుతో పాటు ఆరు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు పంపిణీ

రాయికల్: మండలంలోని మైతాపూర్ గ్రామానికి చెందిన వట్టిమల్ల ఉమారాణికి ఇటీవల శస్త్ర చికిత్స జరగగా, మాజీమంత్రి జీవన్‌రెడ్డి చొరవతో సీఎం రిలీఫ్‌ఫండ్ ద్వారా రూ.60 వేలు మంజూరు కాగా, శుక్రవారం చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గోపి రాజిరెడ్డి, నాయకులు తలారి రాజేశ్ పాల్గొన్నారు.

రక్తదానం చేసి ప్రాణాలు కాపాడాలి

జగిత్యాల: రక్తదానం చేసి ప్రాణాలు కాపాడాలని ఐఎంఏ అధ్యక్షుడు హేమంత్ అన్నారు. శుక్రవారం ఐఎంఏ హాల్‌లో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్వస్థ్ నారి స్వశక్తి పరివార్ కింద రక్తదాన శిబిరం నిర్వహించారు. ప్రతి ఒక్కరు రక్తదానం చేయాలన్నారు. 20 మంది రక్తదానం చేయగా, వారికి ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి ఆకుతోట శ్రీనివాస్‌రెడ్డి, కోశాధికారి సుదీర్‌కుమార్ పాల్గొన్నారు.

పద్మశాలీ సంఘ భవనానికి నిధులు మంజూరు

పెగడపల్లి: మండల కేంద్రంలోని పద్మశాలీ సేవా సంఘం భవనం నిర్మాణం కోసం రూ. 5 లక్షలు మంజూరైనట్లు సంఘం నాయకులు తెలిపారు. ఈ మేరకు సంబంధిత చెక్కును శుక్రవారం ధర్మపురి క్యాంపు కార్యాలయంలో మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ పద్మశాలీ సంఘం నాయకులకు అందజేశారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడు గాజుల గంగమల్లేశం, నాయకులు భోగ గంగాధర్, గోపికృష్ణ, భోగ గోపి, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో చిన్నారుల ఎదుగుదల

రాయికల్: పోషణ పదార్థాలతో చిన్నారుల ఎదుగుదల ఉంటుందని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ పద్మావతి అన్నారు. శుక్రవారం రాయికల్ పట్టణంలోని 9వ అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ మాసం సందర్భంగా చిన్నారులకు అన్నప్రాసన చేశారు. ఆకుకూరలు, చిరుధాన్యాలు, పప్పులు, బెల్లంతో చేసిన పదార్థాలు చిన్నారులు ఎక్కువ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు ఉమాదేవి, పద్మ, సిందూరి, సుమలత పాల్గొన్నారు.

పీహెచ్‌సీ సేవలు సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న డెప్యూటీ డీఎంహెచ్‌వో శ్రీనివాస్

జగిత్యాలరూరల్: ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సేవలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా మాత శిశు సంరక్షణ అధికారి డాక్టర్‌జైపాల్‌రెడ్డి అన్నారు. శుక్రవారం జగిత్యాల రూరల్ మండలం కల్లెడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో స్వస్థ్ నారీ స్వశక్తి అభియాన్ కార్యక్రమంలో భాగంగా మెగా వైద్య శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యులు సౌజన్య, హరిత, నాయిని పాల్గొన్నారు.

ప్రతీ ఒక్కరు ఆరోగ్య పరీక్షలు చేసుకోవాలి

జగిత్యాల: ప్రతీ ఒక్క మహిళ ఆరోగ్య పరీక్షలు చేసుకోవాలని డెప్యూటీ డీఎంహెచ్‌వో శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం మాట్లాడుతూ, మహిళల కోసం వచ్చేనెల 2వ తేదీ వరకు స్వస్థ్ నారి స్వశక్తి పరివార్ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు, దీనిలో ప్రతీ ఒక్కరికి రక్త పరీక్షలు చేయడం జరుగుతుందని, ఏదైనా వ్యాధులుంటే చికిత్సలు సైతం అందిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్ శ్రీనివాస్, హేమంత్ పాల్గొన్నారు.

విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం



విద్యార్థుల తల్లిదండ్రులతో ప్రిన్సిపాల్

జగిత్యాల: విద్యార్థుల అభివృద్ధికి సమష్టిగా కృషి చేయాలని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ అలియా మక్సూద్ అన్నారు. శుక్రవారం కళాశాలలో విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. విద్యార్థులు చదువుపై దృష్టి సారించి తల్లిదండ్రుల పేరు నిలబెట్టాలని ప్రభుత్వ ఎస్‌కేఎన్‌ఆర్ బాలుర కళాశాల ప్రిన్సిపల్ నాగభూషణం అన్నారు. శుక్రవారం కళాశాలలో తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు.

ధర్మపురి: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం కళాశాల ప్రిన్సిపాల్ శైలజా ఆధ్వర్యంలో విద్యార్థుల తల్లిదండ్రులతో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు.

మేడిపల్లి: ప్రభుత్వ కళాశాలలో ప్రిన్సిపల్ రమేష్‌బాబు తల్లిదండ్రుల సమావేశం శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ నర్సిరెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

సారంగాపూర్: విద్యార్థులను అనుక్షణం తల్లితండ్రులు కనిపెట్టుకుని ఉండాలని సారంగాపూర్, బీర్‌పూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలల ప్రిన్సిపల్స్ రమేష్‌బాబు, రామకృష్ణ అన్నారు. శుక్రవారం ఆయా కళాశాలల్లో అధ్యాపకులు, విద్యార్థుల తల్లితండ్రులతో సమావేశాలను నిర్వహించారు.

కొడిమ్యాల: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు నాణ్యమైన విద్యనందిస్తున్నామని ప్రిన్సిపాల్ కే వేణు అన్నారు. శుక్రవారంవిద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు.

మల్యాల: మల్యాల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం విద్యార్థుల తల్లిదండ్రులు, అధ్యాపకుల సమావేశం నిర్వహించారు.

కోరుట్లటౌన్: విద్యార్థుల భవిష్యత్తుకు అందరం సహకరిద్దామని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఇమ్రాన్‌ఖాన్ అన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు.